నమస్తే తెలంగాణ

# వికారాబాద్

హైదరాబాద్, బుధవారం 4 జూన్ 2025 VIKARABAD

## రోడ్డున పడేశారు.. ఆదుకోండి

### ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల ఆందోళన

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల సమన్వయ లోపంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని, రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్టు విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఈవీడీఎం విభాగంలో డ్రైవర్లుగా పనిచేసే తమను హైడ్రాకు బదిలీ చేశారని.. హైడ్రా అధికారులు తమను డ్రైవర్ వృత్తి కాకుండా పార్కుల్లో సెక్యూరిటీ సిబ్బందిగా వినియోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కొందరిని హైడ్రా తీసుకోకుండా తిరిగి జీహెచ్ఎంసీకి పంపించిందని ఆరోపించారు. ఈ రెండు శాఖల సమన్వయ లోపంతో నలిగిపోతున్నామన్నారు. జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబ పోషణ కూడా భారమవుతున్నదని.. ఇంటి అద్దె కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నామని వాపోయారు. కమిషనర్ జోక్యం చేసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



శంకర్‌పల్లిలోని ఓ రేషన్ షాపు ఎదుట బియ్యం కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

**ఇష్టానుసారంగా ధాన్యాన్ని తూకం చేస్తున్న కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలోని నిర్వాహకులు**

- ప్రభుత్వ నిబంధనలు తుంగలో..
- వారు చెప్పినట్లు వింటే.. సవ్యంగా కొలతలు
- లేకుంటే అన్నదాతకు అష్టకష్టాలే..
- తేమ శాతం 17 వచ్చినా బస్తాకు 42 కిలోల 500 గ్రాముల చొప్పున తూకమే..
- అన్నదాత ప్రశ్నిస్తే.. రైస్‌మిల్లర్లు మాకు అలాగే చేయాలని చెప్పారని బుకాయింపు



కాశీంపూర్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో తూకం విషయంలో వాదిస్తున్న అన్నదాతలు

# దర్జాగా దోపిడీ!

నిర్వాహకులు ధాన్యాన్ని దర్జాగా దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా తూకాలు వేస్తూ అన్నదాత జీవితాలతో ఆడుకుంటున్నారు. వారు చెప్పింది వింటే ఏ కొర్రీ లేకుండా ధాన్యం తూకం చేసి పంపిస్తున్నారు. లేదంటే ముప్పు తిప్పలు తప్పవు. ఎవరికైనా చెబితే ధాన్యం కొనుగోలు చేయరేమోనని ఆందోళనలో ఉన్నాడు అన్నదాత. ప్రస్తుతం మండలంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొన్నది. **-బషీరాబాద్, జూన్ 3**

దళారుల చేతుల్లో రైతన్న మోసపోకుండా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి రైతు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించి రైతన్న కండ్లలో ఆనందాన్ని నింపింది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలు దళారులను తలదన్నేలా మారాయి.

మండలంలోని కాశీంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో నిత్యం ఏదో ఒక లొల్లి జరుగుతున్నది. నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ధాన్యాన్ని విక్రయించిన ఓ రైతు బిల్లు చేసేందుకు నిర్వాహకులు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఓ రైతుకు చెందిన ధాన్యాన్ని తక్కువ ధరకు కొని.. ఎక్కువ ధరకు విక్రయించినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోకుండా నిర్వాహకులు బస్తాకు 42 కిలోల 500 గ్రాముల చొప్పున, క్వింటాకు 4 నుంచి 5 కిలో ల ధాన్యాన్ని ఎక్కువ తూకం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం 17 వచ్చి నా బస్తాకు 42 కిలోల 500 గ్రాములు ఎక్కువగా తూకం చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. అడ్డగోలుగా తూకం చేస్తూ నిలువునా ముంచుతున్నారని, గట్టిగా ప్రశ్నిస్తే మిల్లర్లు మీ ధాన్యాన్ని తీసుకోరని భయపడుతున్నారని అన్నదాతలు పేర్కొంటున్నారు.

ఉదాహరణకు ఓ రైతుకు చెందిన 800 బస్తాలు తూకం చేస్తే 800 బస్తాలకు 42 కిలోల 500 గ్రాముల చొప్పున లెక్క కడితే 34 టన్నులు అవుతుంది. అయితే నిర్వాహకులు లారీ లోడింగ్ చేసి రైస్‌మిల్లులకు పంపించేటప్పుడు 800 బస్తాలకు బదులు 771 బస్తాలను మాత్రమే లోడ్ చేస్తున్నారని, 41 కిలోల చొప్పున లెక్కిస్తే 771 బస్తాలే అవుతున్నాయ ని రైతులు పేర్కొంటున్నారు. మిగతా 29 బస్తాల ధాన్యాన్ని తక్కువగా లెక్కిస్తూ నిర్వాహకులు నిలువునా మోసం చేస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కేవలం ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని ఇప్పటివరకు కాశీంపూర్ కొనుగోలు కేంద్రం ద్వారా 25,000 బస్తాల వరకు ధాన్యాన్ని సేకరించారని..

ఆ లెక్కన పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు మండి పడుతున్నారు.



**అడ్డగోలుగా తూకం చేస్తున్నారు..**

తేమ శాతం 17 కంటే తక్కువ వచ్చింది..అయినా బస్తాకు 42 కిలోల 500 గ్రాముల చొప్పున తూకం చేశారు. ఇలా ఎందుకు చేస్తున్నారని నిర్వాహకులను ప్రశ్నిస్తే మాకు మిల్లర్లు చెప్పారు మేము అలాగే తూకం చేస్తున్నామని బదులిచ్చారు.

**-జగనాథ్‌రెడ్డి, రైతు మంతట్టి**

**చెప్పినా వినడం లేదు..**

41 కిలోల చొప్పున తూకం చేయాలని నిర్వాహకులకు మా సిబ్బంది చెప్పినా వినడం లేదు. రైతుల వద్ద ఎక్కువ తూకం చేసి వారిక నష్టం కలిగించొద్దని కేంద్రాన్ని సందర్శించినప్పుడు సూచించా. అయినా వారు ఏ ధైర్యంతో చేస్తున్నారో మాకు తెలియదు.

**- పద్మారావు, ఏపీఎం**



**చేసేదేమీ లేకే..**

రైతుకు విలువ లేదు. అన్నదాతను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను నిర్వాహకులు చెప్పినట్లు విని విక్రయించాల్సి వస్తున్నది. వారితో వాదిస్తే కొర్రీలు పెట్టి ధాన్యాన్ని సేకరించారని భయపడి.. అమ్ముకోవాల్సి వస్తున్నది. **-రవి, రైతు, కాశీంపూర్**

## సన్నబియ్యానికి సర్వర్ కష్టాలు

**రేషన్ షాపుల ఎదుట భారీగా లబ్ధిదారుల బారులు**

- తెల్లవారుజాము నుంచే గంటల తరబడి పడిగాపులు
- అన్నీ కలిపి ఒకే స్లిప్‌పై ఇస్తే ఇబ్బందులు తప్పుతాయంటున్న జనాలు

షాబాద్, జూన్ 3 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒకచోట స్టాక్ లేక దుకాణాలను మూసి వేస్తుండగా.. మరోచోట స్టాక్ ఉన్నా సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో మిషన్‌లో వేలిముద్రలు పెట్టేందుకు చాలా సమయం పడుతున్నది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది. గతంలో నెల రోజులకోసారి రేషన్ బియ్యం ఇచ్చే సమయంలో 15 నిమిషాల వ్యవధిలో లబ్ధిదారుడికి బియ్యం అందేది. అక్కడ సర్వర్ మిషన్‌లో ఒకేసారి వేలిముద్రలు పెట్టి, అదే సమయంలో బియ్యం ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో నెల కోటా బియ్యానికి ఒక్కోసారి తూకం వేయాల్సి వస్తున్నది. కేంద్రం ఇచ్చే బియ్యానికి ఒకసారి, రాష్ట్రం ఇచ్చే బియ్యానికి మరోసారి వేలిముద్ర వేయిస్తున్నారు. ఇలా మూడు నెలలు కలిపి ఆరుసార్లు వేలిముద్రలు తీసుకుంటున్నారు.

### లబ్ధిదారులకు తప్పని తిప్పలు

జిల్లాలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో ఉన్న గ్రామాల్లోని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడంతో తెల్లవారుజాము నుంచే సంచులు పట్టుకుని లబ్ధిదారులు షాపుల ఎదుట బారులు తీరుతున్నారు. పనులు మానుకుని బియ్యం కోసం పడిగాపులు కాయాల్సి వస్తున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నెల రేషన్ బియ్యం కోసం రెండు సార్లు వేలిముద్ర వేయాల్సి వస్తున్నదని.. మూడు నెలల బియ్యానికి ఆరుసార్లు వేలిముద్రలు తీసుకుంటున్నారని విసుగు చెందుతున్నారు. క్యూలో నిలబడిన అరగంట తర్వాతే తమ వంతు వస్తున్నదని.. దానికి తోడు సర్వర్ సరిగ్గా పనిచేయక ఇబ్బందులు తప్పడంలేదని పలువురు పేర్కొంటున్నారు. అన్నీ కలిపి ఒకే స్లిప్పుగా ఇస్తే కొంచెమైనా ఇబ్బంది తగ్గేదని.. లబ్ధిదారులు వాపోతున్నారు.





శంకర్‌పల్లిలోని సాయిబాబా ఆలయం వద్ద ఉన్న రేషన్ షాపు తెరువక ముందే సంచులు, బ్యాగులను వరుసగా పెట్టిన లబ్ధిదారులు

## ప్రీలాంచ్ పేరిట ₹300 కోట్ల మోసం

**తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తామని జయత్రి రియల్ ఎస్టేట్ సంస్థ టోకరా**

**న్యాయం చేయాలని బాధితుల మొర**

సిటీ బ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివారులోని గోపన్‌పల్లిలో తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తానని ప్రీలాంచ్ పేరిట జయత్రి రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మోసం చేసిందని బాధితులు ఆరోపిస్తున్నారు. వందలాది మంది మధ్యతరగతి ప్రజల నుంచి దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి ముఖం చాటేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జయత్రి కంపెనీ తమను ఆకర్షణీయమైన బ్రోచర్లు, ప్రీ లాంచ్ ఆఫర్లతో డిస్కౌంట్ ధరలకు ప్రైమ్ ప్లాట్లను ఇస్తామని నమ్మబలికిందని బాధితులు ఆరోపిస్తున్నారు. వీరికి కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేస్ వద్ద100 మందికి పైగా ఉద్యోగులతో కూడిన విలాసవంతమైన కార్పొరేట్ కార్యాలయం చూపించడంతో పెద్ద సంస్థ అని నమ్మామని అంటున్నారు. రెండేండ్లలోనే ప్లాట్లను అప్పగిస్తామంటే రూ. 20 లక్షల నుంచి రూ.1.8 కోట్ల వరకు వివిధ దశల్లో చెల్లించామని చెబుతున్నారు. గడువు ముగిసినా వివిధ రకాల సాకులు చూపిస్తూ కాలం గడుపుతున్నారని అన్నారు. ప్రధాన నిందితుడు కాకర్ల శ్రీనివాస్, మరో 19 మంది డైరెక్టర్లతో కలిసి ఫిబ్రవరి 2021లో జయత్రి గ్రూప్‌ను స్థాపించినట్లు తెలుస్తున్నది. హిల్టన్ జయ డైమండ్ పేరుతో ఇప్పటికే భారీ వెంచర్‌ను ప్రారంభించి మోసానికి పాల్పడి సంస్థకు చెందిన శ్రీనివాస్‌తో పాటు మరికొందరు అరెస్టయి ప్రస్తుతం బెయిల్‌పై బయటికి వచ్చినట్లు వారు చెబుతున్నారు. ఇదే సంస్థ గతంలో రాజమండ్రిలోనూ ఇలాంటి మోసానికే పాల్పడిందని బాధితులు చెబుతున్నారు.

**పోలీసులు, ఈడీకి ఫిర్యాదు..**

జయతి గ్రూప్ మోసంపై ఇప్పటికే పోలీసులు, ఈడీ, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు వర్మకుమార్, మూర్తి, ప్రసాద్, గణేశ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు జోక్యం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తాము మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చామని, తామ పెట్టిన ప్రతి రూపాయీ కష్టపడి సంపాదించినదేనని అన్నారు.






## మున్సిపాలిటీల్లో నేటి నుంచి వార్డుల విభజన

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో జరుగనున్న ప్రక్రియ
- పెరుగనున్న వార్డుల సంఖ్య

రంగారెడ్డి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో నేటి నుంచి వార్డులను అధికారులు విభజించనున్నారు. జిల్లా పరిధిలో కొత్తగా ఏర్పడిన పలు మున్సిపాలిటీలతోపాటు అదనంగా గ్రామాలు కలిసిన మున్సిపాలిటీలకు చెందిన వార్డులనూ విభజించనున్నారు. తద్వారా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరుగనున్నది. వార్డుల విభజన ప్రక్రియ పూర్తి కాగానే అధికారులు ప్రకటన విడుదల చేస్తారు. అప్పుడు మార్పులు, చేర్పుల కోసం వారం రోజులపాటు గడువు ఇస్తారు. అభ్యంతరాలున్న వారు ఫిర్యా దు చేస్తే.. వాటిని పరిశీలించి.. నోటిఫికేషన్‌ను అధికారులు జారీ చేయనున్నారు.

**ఐదు మున్సిపాలిటీల్లో ..**

జిల్లాలోని పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, శంషాబాద్ మున్సిపాలిటీలతోపాటు కొత్తగా ఏర్పాటైన చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరుగనున్నది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో 24 వార్డులుండగా.. అదనంగా మరో ఐదు గ్రామాలు కలవడంతో వార్డుల విభజన తప్పనిసరి అయింది. తుక్కుగూడ మున్సిపాలిటీలో ప్రస్తుతం 16 వార్డులుండగా.. కొత్తగా మరో మూడు గ్రామాలు, అలాగే, శంషాబాద్ మున్సిపాలిటీలో 25 వార్డులుండగా.. కొత్తగా మరో 7 గ్రామాలు కలవడంతో వార్డుల విభజన అనివార్యమైంది. కొత్తగా ఏర్పాటైన చేవెళ్ల మున్సిపాలిటీలో ప్రస్తుతం 18 వార్డులుండగా.. కొత్తగా మరో 12 గ్రామాలు, మొయినాబాద్ మున్సిపాలిటీలో 26 వార్డులుండగా.. కొత్తగా మరో 10 గ్రామాలను విలీనం చేయడంతో వీటిలోనూ వార్డుల విభజన జరుగనున్నది. వార్డుల విభజన అనంతరం ఈ రెండు మున్సిపాలిటీల్లోనూ మరిన్ని వార్డులు పెరిగే అవకాశాలున్నాయి.



జీహెచ్ఎంసీ జోనల్ సిటీ ప్లానర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫేస్- 5 ప్లాట్ యజమానులు

## రోడ్డును చూపి అక్రమ నిర్మాణాలు

**నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జోనల్ సిటీ ప్లానర్‌కు ఫిర్యాదు చేసిన ఫేస్-5 వాసులు**

మాదాపూర్, జూన్ 3 : మియాపూర్ జనప్రియనగర్ ఫేస్-5 లో నివాసముంటున్న ప్లాట్ యాజమానులు గతంలో ఎమ్మె ల్యే నిధుల కింద కాలనీలో రోడ్డు నిర్మించారు. అయితే, ఆ కాలనీకి ఆనుకుని ఉన్న అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు జనప్రియనగర్ ఫేస్-5 యజమానులు ఏర్పాటు చేసుకున్న రోడ్డును లేఅవుట్‌గా చూపించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో మంగళవారం ఫేస్-5 బాధితులు జీహెచ్ఎంసీ జోనల్ సిటీ ప్లానర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫేస్-5లో మొత్తం 650 ప్లాట్లుండగా.. ఆ ప్లాట్లను గ్రూప్ హౌసింగ్ పథకం కింద సర్వేనంబర్, 47, 48, 49 వైడ్ ఎల్ ఆర్ నంబర్ 15512/ఎంపీ 2హెచ్/ 9807 హుడా ప్రొసెసిం గ్ నంబర్‌జీ 129/ బీపీ/3350/2000 గుంటల్లో విలేజ్‌లో నిర్మించారు. ఫేస్-5 స్థలానికి పక్కన ఉన్న కొంతమంది ఇంటి నిర్మాణం చేపట్టి డ్రైనేజీ, నాలా ఆక్రమించి ఫేస్-6 సరిహద్దు గోడను కూల్చేసి కాలనీ రోడ్డును తమ కాలనీ రోడ్డుగా చూపించి తమ స్థలంలోకి ప్రవేశించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని.. అధికారులు వారికిచ్చిన బిల్డింగ్ పర్మిషన్, ఆక్యూపెన్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని కోరారు. అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకొని తమ కాలనీని సందర్శించి న్యాయం చేయాలని ఫేస్-5 కాలనీ ప్రజలు కోరారు.

